

సీఎం జగన్ విశాఖ రాక రేపు



విశాఖపట్నం, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): సీఎం జగన్మోహన్‌రెడ్డి మంగళవారం విశాఖ రానున్నారు. పీఎంపాలెంలోని ఏసీఏ-వీడీసీఏ క్రికెట్ స్టేడియంలో జరిగే 'ఆడుదాం ఆంధ్ర' ముగింపోత్సవానికి హాజరయ్యేందుకు సాయంత్రం 5.20 గంటలకు సీఎం విశాఖ ఎయిర్‌పోర్టుకు చేరుకుంటారు. అక్కడి నుంచి హెలికాప్టర్‌లో ఐటీ హిల్-3పై ఉన్న హెలీప్యాడ్‌కు వస్తారు. అక్కడి నుంచి రోడ్డుమార్గంలో ఆరు గంటలకు స్టేడియానికి వస్తారు. మ్యాచ్‌ని తిలకించి రాత్రి 8.05 గంటలకు విమానాశ్రయానికి వచ్చి, ప్రత్యేక విమానంలో విజయవాడ వెళ్తారు.

ఊటనీరే దిక్కు

వాలుగూడెంలో తాగునీటి సమస్య

గ్రామంలో నాలుగేళ్ల క్రితం బోరు తవ్వి వదిలేసిన అధికారులు

- బోరు హెడ్ బిగించకపోవడంతో వినియోగంలోకి రాని వైనం
- కిలో మీటరు దూరం నుంచి ఊటనీరు తెచ్చుకుంటున్న ఆదివాసీ మహిళలు
- పట్టించుకోని పాలకులు, అధికారులు

కొయ్యూరు, ఫిబ్రవరి 11:

తరాలు మారిన గిరిజనుల తలరాతలు మారడం లేదు. పాలకులు మారినా ఆదివాసీలను పట్టించుకునే నాథుడే లేడు. మన్యంలోని పలు గ్రామాల్లో రక్షిత మంచినీటి పథకాలు, చేతి పంపులు, బావులు లేకపోవడంతో నివాసాలకు సుదూరంగా వున్న ఊటగెడ్డలపై ఆధారపడుతున్నారు. ఆ నీరు కలుషితమైనది కావడంతో వైరల్ జ్వరాలు, టైఫాయిడ్, అతిసార, తదితర వ్యాధులకు గురవుతున్నారు. రక్షిత మంచినీటి సదుపాయం కల్పించాలని పాలకులు, అధికారులకు పలుమార్లు విన్నవించుకున్నప్పటికీ పట్టించుకోవడంలేదని గిరిజనులు వాపోతున్నారు.



ఊటనీటిని పట్టుకుంటున్న వాలుగూడెం మహిళలు (ఇన్‌సెట్‌లో) నాలుగేళ్ల క్రితం బోరు తవ్వి హెడ్ బిగించకుండా ఉంచిన దృశ్యం



కొయ్యూరు మండలంలోని మఠం భీమవరం పంచాయతీ వాలుగూడెం గ్రామస్థులు తాగునీటికి ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గ్రామంలో తాగునీటి సమస్య పరిష్కరించేందుకు నాలుగు సంవత్సరాల క్రితం పాఠశాల ఎదురుగా బోరును కొట్టించినా ఇప్పటికీ బోరుకు హెడ్ బిగించకపోవడంతో గ్రామస్థులు కలుషిత ఊటనీటిపైనే ఆధారపడుతున్నారు. గ్రామంలో తాగునీటి వసతి కల్పించాలని పలుమార్లు పాలకులు, అధికారులకు విన్నవించినా ఫలితం లేకపోయిందని గిరిజనులు వాపోతున్నారు. సుమారు 100 మంది జనాభా గల వాలుగూడెం ఎగువ వీధిలో ఆదివాసీ గిరిజనులు జీవనం సాగిస్తున్నారు. వీరికి తాగునీటి వసతి లేదు. గత కొన్ని దశాబ్దాలుగా గ్రామానికి సుమారు కిలోమీటరు దూరంలో గల జువ్విచెట్టు పరిసర ప్రాంతం నుంచి ప్రవహించే కొండవాగు ప్రవాహం వద్ద ఊటనీటికి వీలుగా ఏర్పరచుకున్న గొయ్యి నుంచి నీటిని సేకరిస్తున్నారు. నాలుగేళ్ల క్రితం గ్రామంలోని పాఠశాలకు సమీపంలో బోరును తవ్వారు. అయితే ఈ బోరును వినియోగంలోకి తెచ్చేలా ఇప్పటి వరకు ... మిగతా 8వ పేజీలో

చిత్రకాయపుట్టులోనూ అంతే..

పెదబయలు, ఫిబ్రవరి 11: మండలంలోని అనేక గ్రామాల్లో తాగునీటి వసతి లేక గిరిజనులు ఇబ్బంది పడుతున్నారు. బిందెడు నీళ్ల కోసం ఊరి చివరిలోని ఊటగెడ్డ వద్దకు కొండలు, గుట్టలు, పొలం గట్లు దాటుకుని వెళుతున్నారు. బొంగరం పంచాయతీ చిత్రకాయపుట్టు గ్రామంలో తాగునీటి సమస్య దశాబ్దాల కాలంగా ఉంది. ఊరి చివరిలోని ఊటగెడ్డ వద్దకు గిరిజన మహిళలు వెళ్లి బిందెలపై చీర పరిచి ఆ ఊటనీళ్లను వడగట్టి గుట్టలు, పొలం గట్లు దాటుకుంటూ ఇళ్లకు చేరుతున్నారు. విష కీటకాలను సైతం లెక్కచేయకుండా ప్రాణాలకు తెగించి ఊటనీటి కోసం వెళుతున్నారు. ఆ నీరు కలుషితమని తెలిసినా గత్యంతరం లేక తాగుతున్నామని గిరిజనులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ సమస్యను పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకువెళ్లినా పట్టించుకోవడం లేదని వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి గ్రామంలో నీటి వసతి కల్పించాలని వారు కోరుతున్నారు.



చిత్రకాయపుట్టు గ్రామంలో ఊటనీటిని సేకరిస్తున్న గిరిజన మహిళలు

చెరువులవేనం వద్ద మంచు అందాలను తిలకిస్తున్న పర్యాటకులు



పర్యాటకుల సందడి

బొర్రా గుహలు మొదలుకుని లంబసింగి వరకు సందర్శకుల రద్దీ

- మంచు, చలి తీవ్రత కొనసాగుతుండడమే కారణం

(ఆంధ్రజ్యోతి- పాడేరు)

మన్యంలోని సందర్శనీయ ప్రాంతాల్లో పర్యాటకుల సందడి కొనసాగుతున్నది. మైదాన ప్రాంతంలో ఎండల తీవ్రత మొదలు కావడంతో పాటు ఏజెన్సీలో చలి, పొగమంచు ప్రభావం తగ్గకపోవడంతో జనం ఏజెన్సీ బాటపడుతున్నారు. దీంతో అనంతగిరి మండలం బొర్రా గుహలు మొదలుకుని చింతపల్లి మండలం లంబసింగి వరకు పర్యాటకుల సందడి కొనసాగింది.



వంజంగి మేఘాల కొండపై పర్యాటకులు

ప్రస్తుతం ఏజెన్సీలో చలి ప్రభావం, పొగమంచు కొనసాగుతుండడంతో సందర్శకుల తాకిడి పెరిగింది. దీంతో ఆదివారం అనంతగిరి మండలం బొర్రా గుహలు, కటికి, తాడిగుడ జలపాతాలు, అరకులోయ మండలంలో మాడగడ మేఘాల కొండ, గిరిజన మ్యూజియం, పద్మాపురం గార్డెన్, కొత్తవలస వ్యవసాయ క్షేత్రం, పెదలబుడు గిరిజన గ్రామదర్శిని, డుంబ్రిగుడ మండలంలోని చాపరాయిగెడ్డ, పెదబయలు మండలంలో తారాబు జలపాతం, పాడేరు మోదకొండమ్మ ఆలయం, వంజంగి హిల్స్, జి.మాడుగుల మండలంలోని కొత్తపల్లి జలపాతం, చింతపల్లి మండలంలో తాజంగి, చెరువువేనం, లంబసింగి ప్రాంతాలను పర్యాటకులు అధిక సంఖ్యలో సందర్శించారు.

వంజంగి మేఘాల కొండ వద్ద..

పాడేరురూరల్: మండలంలోని వంజంగి మేఘాల కొండకు పర్యాటకుల తాకిడి కొనసాగుతోంది. మంచు మేఘాల కొండను తిలకించేందుకు వివిధ జిల్లాలతో పాటు తెలంగాణ, ఒడిశా రాష్ట్రాల నుంచి కూడా పర్యాటకులు తరలివస్తున్నారు. చాలా మంది శనివారం సాయంత్రానికే పాడేరు చేరుకున్నారు. ఆదివారం వేకువజామున వంజంగి మేఘాల కొండకు చేరుకొని పాల సముద్రాన్ని తలపించే మంచు మేఘాలతో పాటు భానుడి కిరణాలను తిలకించి మంత్రముగ్ధులయ్యారు. ఫొటోలు దిగుతూ ఉదయం 8 గంటల వరకు ఈ ప్రాంతంలో సరదాగా గడిపారు.

లంబసింగి వద్ద..

చింతపల్లి: ఆంధ్ర కశ్మీర్ లంబసింగికి పర్యాటకుల తాకిడి పెరిగింది. పర్యాటక సీజన్ ముగుస్తుండడంతో ప్రకృతి అందాలను వీక్షించేందుకు పలు రాష్ట్రాల నుంచి పర్యాటకులు లంబసింగికి తరలివస్తున్నారు. ఆదివారం లంబసింగికి వేలల్లో పర్యాటకులు వచ్చారు. దీంతో ఉదయం నుంచే లంబసింగి, చెరువులవేనం, తాజంగి జలాశయం వద్ద పర్యాటకుల ... మిగతా 8వ పేజీలో

తగ్గని చలి తీవ్రత

దట్టంగా పొగమంచు

- జి.మాడుగులలో 13.7 డిగ్రీలు



పాడేరులో ఆదివారం ఉదయం దట్టంగా పొగమంచు

పాడేరు, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): ఏజెన్సీలో కనిష్ఠ ఉష్ణోగ్రతలు స్థిరంగా కొనసాగడంతో చలి, పొగమంచు ప్రభావం తగ్గడం లేదు. దీంతో ఏజెన్సీ వాసులు వణుకుతున్నారు. జి.మాడుగులలో 13.7, అనంతగిరిలో 14.8, అరకులోయలో 15.5, పెదబయలులో 15.6, ముంచంగిపుట్టులో 15.8, డుంబ్రిగుడలో 16.3, పాడేరులో 16.6, చింతపల్లిలో 16.9, డిగ్రీల సెల్సియస్ కనిష్ఠ ఉష్ణోగ్రతలు ఆదివారం నమోదయ్యాయి. శీతాకాలం నేపథ్యంలో మరికొన్ని రోజులు చలి వాతావరణం కొనసాగే అవకాశాలున్నాయని వాతావరణశాఖ సూచిస్తున్నది. మన్యంలో తెల్లవారుజాము నుంచి ఉదయం తొమ్మిది గంటల వరకు దట్టంగా పొగ మంచు కురుస్తున్నది. దీంతో ఏజెన్సీలో రోడ్డు స్పష్టంగా కనిపించకపోవడంతో హెడ్ లైట్లు వేసుకుని వాహనాలు రాకపోకలు సాగిస్తున్నాయి. అలాగే మధ్యాహ్నం వేళలో ఒక మోస్తరుగా మాత్రమే ఎండ కాస్తూ, సాయంత్రం ఆరు గంటల నుంచి చలి ప్రభావం మొదలవుతున్నది.

ముంచంగిపుట్టులో..

ముంచంగిపుట్టు: కనిష్ఠ ఉష్ణోగ్రతలు కాస్త పెరుగుతున్నా మండలంలో చలి ప్రభావం మాత్రం తగ్గడం లేదు. దీంతో ఆదివారం ముంచంగిపుట్టులో ఉదయం తొమ్మిది గంటల వరకు పూర్తి స్థాయిలో మంచు తెరలు వీడలేదు. పది గంటలు దాటిన తరవాత గాని ఎండ కాయలేదు. కాగా సాయంత్రమైతే చలి మొదలవుతున్నది.

నిరుపేద కుటుంబాల్లో మద్యం చిచ్చు



ఇల్లు, ఒళ్లు గుల్ల

- ఆదాయంలో సగానికిపైగా తాగుడికే ఖర్చు పెడుతున్న రోజువారీ కూలీలు
- రేట్లు పెరగడం, నాణ్యత లేకపోవడంతో ఆర్థికంగా, ఆరోగ్యపరంగా సమస్యలు
- కౌన్సెలింగ్ కోసం తీసుకువెళుతున్న కుటుంబసభ్యులు
- నెరవేరని మద్య నిషేధం హామీ

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

'అధికారంలోకి వచ్చిన వెంటనే దశల వారీగా మద్యాన్ని నిషేధిస్తాం. అక్క, చెల్లెమ్మల కుటుంబాల్లో చిచ్చు పెడుతున్న మద్యాన్ని స్టార్ హోటళ్లకు పరిమితం చేస్తాం'

- ఇవీ ప్రతిపక్షంలో ఉండగా వైఎస్ జగన్మోహన్‌రెడ్డి చెప్పిన మాటలు.

..అయితే, అధికారంలోకి వచ్చిన తరువాత ఆయన ఆ హామీని పూర్తిగా విస్మరించారు. పైగా మద్యం దుకాణాలను ప్రభుత్వ ఆధ్వర్యంలోనే నడుపుతూ రాష్ట్రానికి ప్రధాన ఆదాయ వనరుగా మార్చారు. ఇంకా ధరలు విపరీతంగా పెరగడం, నాణ్యత లేకపోవడంతో మందుబాబులు ఆర్థికంగా, ఆరోగ్యపరంగా దెబ్బతింటున్నారు. గడిచిన 20 ఏళ్ల నుంచి తాగుతున్నానని, గడిచిన ఐదేళ్ల నుంచి అమ్ము తున్న మద్యాన్ని ఎప్పుడూ చూడలేదని విశాఖలో నివాసం ఉంటూ తాపీ పని చేసుకుంటున్న రామారావు పేర్కొన్నాడు. వారం కిందట కడుపులో మంటగా ఉండడంతో ఆస్పత్రికి వెళ్లిన రామారావుకు అల్సర్లు ఫామ్ అయ్యాయని వైద్యులు చెప్పారు. తాగుడుకు దూరంగా ఉండకపోతే ప్రమాదమని హెచ్చరించారు.



- విశాఖలో ఉంటూ భవన నిర్మాణ పనికి వెళ్లే శ్రీనుకు తాగుడు అలవాటు ఉంది. గతంలో పనికి వెళ్లి వచ్చిన తరువాత తాగి ఇంట్లోనే ఉండేవాడు. ఈ మధ్యకాలంలో ఉన్న డబ్బు మొత్తం తాగుడికే ఖర్చు పెడుతున్నాడు. అతడిని కుటుంబ సభ్యులు మానసిక వైద్యుల వద్దకు తీసుకువెళ్లి చూపించగా, కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నారు. అయినా, ఫలితం లేకుండాపోతోంది. మందులు వాడుతున్న సమయంలో కూడా మద్యం తాగేస్తుండడంతో సమస్య మళ్లీ మొదటకు వచ్చేసింది.
- విశాఖ వన్‌టౌన్ మార్కెట్‌లో పండ్ల వ్యాపారం చేసుకునే అప్పారావు మద్దిలపాలెంలో నివాసం ఉంటున్నాడు. కొన్నాళ్ల నుంచి మద్యం అధికంగా తాగి ఇంటికి వస్తుండడంతో భార్య, భర్తల మధ్య తరచూ గొడవలు జరుగుతున్నాయి. మద్యం అలవాటు నుంచి విముక్తి కల్పించేందుకు నిపుణుల వద్దకు తీసుకువెళ్లింది. వారంలో మూడు రోజులు కౌన్సెలింగ్ ఇప్పించడంతోపాటు మందులు వాడారు. రెండు నెలలు మద్యం మానేసిన అప్పారావు...మళ్లీ సంక్రాంతి తరువాత నుంచి ఇష్టం వచ్చినట్టు తాగుతూ ఆరోగ్యాన్ని పాడు చేసుకుంటున్నాడు.
- శ్రీకాకుళం జిల్లాకు చెందిన రామకృష్ణ అనే యువకుడు నగర పరిధిలోని ఓ టీ దుకాణాన్ని ఏర్పాటు చేసుకున్నాడు. ఏడాదిన్నర నుంచి మద్యానికి అలవాటుపడ్డాడు. తాగుడుకు అలవాటుపడిన దగ్గర నుంచి షాపు తీయకపోవడం, ఇంటికి ఫుల్లుగా తాగి వెళుతుండడంతో కుటుంబ సభ్యులు నచ్చజెప్పే ప్రయత్నం చేశారు. కొద్దిరోజుల కిందట నుంచి వాంతులు అవుతుండడంతో వైద్యుల వద్దకు తీసుకువెళ్లారు. లివర్‌లో సమస్య ఉందని, మందుకు దూరంగా ఉండాలని హెచ్చరించారు. అతడిని తీసుకుని కుటుంబ సభ్యులు సొంతూరు వెళ్లిపోయారు. వైద్యం కోసం నెల రోజులకు ఒకసారి కేజీహెచ్‌కు వస్తున్నారు.

ఆదాయంలో సగానికిపైగా మందుకే...

శ్రీకాకుళం జిల్లాకు చెందిన బాలకృష్ణ పదిహేనేళ్ల కిందట ఉపాధి నిమిత్తం విశాఖ వచ్చాడు. ఇసుకతోటలో నివాసం ఉంటూ పెయింటింగ్ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. నగరానికి వచ్చే నాటికి మద్యం అలవాటు ఉంది. ప్రతిరోజూ పనికి వెళ్లి వచ్చిన తరువాత ఒక సీసా కొనుగోలు చేసి ఇంటికి వచ్చి తాగి, తిని పడుకునేవాడు. మిగిలిన మొత్తాన్ని భార్యకు ఇచ్చేవాడు. కానీ, గడిచిన మూడున్నరేళ్ల నుంచి మద్యానికి పూర్తిగా బానిసగా మారాడు. ఉదయాన్నే పనికి వెళ్లడం, రాత్రికి ఎప్పుడో ఫూటుగా తాగి ఇంటికి రావడం పరిపాటిగా మారింది. ఒక్కోరోజు ఇంటికి కూడా రాకుండా ఆ షాపు బయట నిద్రపోతున్నాడు. పదేళ్ల వయసున్న ఇద్దరు పిల్లలతో అతడి భార్య బిక్కుబిక్కుమంటూ జీవనం సాగిస్తోంది. ఏం చేయాలో, ఎవరికి చెప్పాలో కూడా తెలియక తీవ్రంగా మథనపడుతోంది. కుటుంబ సభ్యులు చెప్పినా అతడిలో మార్పు రాలేదు. గతంతో పోలిస్తే ప్రస్తుతం విక్రయిస్తున్న మద్యం కిక్ ఇవ్వడం లేదని, తాగుతున్న ఫీలింగ్ రాకపోవడం వల్లే ఇంకా తాగాలనిపిస్తోందని హెచ్‌బీ కాలనీలో ఉంటూ బైక్ మెకానిక్‌గా పనిచేస్తున్న రవి తెలిపాడు. గతంలో బీర్ తాగే అలవాటు ఉండేదని, ఇప్పుడు అన్నింటికీ అలవాటు పడిపోయానని, బయట పడేందుకు చేస్తున్న ప్రయత్నాలు విఫలమవుతున్నట్టు ఆవేదన వ్యక్తంచేశాడు. ఇటువంటి వాళ్ల సంఖ్య గడిచిన కొద్దికాలంగా పెరిగింది. ఆదాయంలో సగానికి మించి, పూర్తిగా కూడా మందుకే ఖర్చు పెడుతున్న వారి సంఖ్య పెరిగింది. రోజువారీ కూలికి వెళ్లి ఆదాయం తెచ్చుకునే ఎంతోమంది కుటుంబాల్లో ఇదే పరిస్థితి ఉంది. రోజు కూలికి వెళితే ఐదు వందలు నుంచి ఏడు వందల రూపాయల వరకు వస్తే...అందులో మూడు, నాలుగు వందలు ... మిగతా 8వ పేజీలో

విషాద యాత్ర

సీతపల్లి వాగులో పడి ముగ్గురు విద్యార్థుల మృతి

- రంపయర్రంపాలెంలో విషాదఛాయలు



మృతులు అర్జున్, చరణ్, రామన్‌జీ

రంపచోడవరం, ఫిబ్రవరి 11: విహారయాత్ర విషాదంగా మారింది. రాజమహేంద్రవరం- భద్రాచలం హైవేపై అల్లూరి జిల్లాలో రంపచోడవరం మండలం ఐ.పోలవరం సమీపంలోని సీతపల్లి వాగులో పడి రంపయర్రంపాలెం గ్రామానికి చెందిన ముగ్గురు విద్యార్థులు మృతి చెందారు. దీనికి సంబంధించి వివరాలు ఇలా వున్నాయి. తూర్పుగోదావరి జిల్లా గోకవరం మండలం రంపయర్రంపాలెం గ్రామానికి చెందిన కాకర వీరవెంకట అర్జున్(15), అండిబోయిన దేవిచరణ్(15), లావేటి రామన్‌జీ(15)తో పాటు మరో ఇద్దరు విద్యార్థులు రంపయర్రంపాలెంలోని ప్రభుత్వ జడ్పీ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్నారు. ఈ ఐదుగురూ రెండు మోటారు సైకిళ్లపై విహారయాత్రకంటూ ఆదివారం మధ్యాహ్నం 12:30 గంటల సమయంలో రంపచోడవరం మండలంలోని ఐ.పోలవరం గ్రామ సమీపంలో ఉన్న సీతపల్లి వాగు వద్దకు వెళ్లారు. వాగు వద్ద కాసేపు సెల్‌ఫోన్లతో ఫొటోలు దిగారు. 3-4 గంటల మధ్య అర్జున్, దేవిచరణ్, రామన్‌జీ స్నానం చేసేందుకు వాగులోకి దిగారు. కొద్దిసేపటికి వారి జాడ కనిపించకపోవడంతో గట్టున ఉన్న ఇద్దరు స్నేహితులు గట్టిగా కేకలు వేయడంతో అక్కడే ఉన్న రంపయర్రంపాలేనికి చెందిన మరికొందరు పర్యాటకులు విషయం తెలుసుకొని వారికోసం వెతకడం ప్రారంభించారు. సమీపంలో ఉన్న ఈతగాళ్లు వాగులోకి దిగి గాలించగా ముగ్గురి మృతదేహాలు బయటపడ్డాయి. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం రంపచోడవరం ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

గ్రామంలో విషాద ఛాయలు

విహారయాత్రకు వెళ్లిన ఒకే గ్రామానికి చెందిన ముగ్గురు విద్యార్థులు సీతపల్లి వాగులో పడి మృతి చెందడంతో రంపయర్రంపాలెంలో విషాదఛాయలు అలుముకున్నాయి. మధ్యాహ్నం వరకు కళ్ల ముందే కలియదిరిగిన ముగ్గురు విద్యార్థులు వాగులో పడి మృతి చెందారన్న విషాదవార్త గ్రామస్థులను కలచివేసింది. కాగా అర్జున్ తండ్రి కాకార విష్ణు రేషన్‌షాపు డీలర్. దానిపైన వచ్చే ఆదాయంతోనే కుటుంబ పోషణ జరుగుతోంది. దేవిచరణ్ తండ్రి అండుబోయిన అప్పారావు వ్యవసాయ కూలి. ఏ పూటకాపూట కూలి పనికి వెళ్తేనే గాని జీవనం సాగదు. రామన్‌జీ తండ్రి సత్తిబాబు కూడా వ్యవసాయ కూలీనే. ఇతను కూడా పనికి వెళ్తేనే ఇల్లు గడుస్తుంది. ఎన్నో ఆశలతో పిల్లలను చదివిస్తుంటే వారు ఇలా మృతి చెందడం ఆ పేద కుటుంబంలో విషాదాన్ని నింపింది.

ఆంధ్రజ్యోతి
ఆంధ్రజ్యోతి దినపత్రికలో అన్ని రకాల ప్రకటనలు (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు,
9985411639
ఆంధ్రజ్యోతి దినపత్రిక చందాదారులుగా చేరాలన్నా, పత్రిక సరఫరాలో ఎలాంటి సమస్యలు ఉన్నా, ఈ నెంబరుకు సంప్రదించగలరు.
9985411029

1,474 పీవీటీజీ గ్రామాలకు విద్యుత్ సదుపాయం

- పీఎం జన్‌మన్ పథకం కింద రూ.33.49 కోట్లతో డీపీఆర్
- ఈపీడీసీఎల్ విశాఖపట్నం సర్కిల్ ఎస్ఈ మహేంద్రనాథ్

చింతపల్లి, ఫిబ్రవరి 11: జిల్లాలో పీఎం జన్‌మన్ పథకంలో భాగంగా 1,474 పీవీటీజీ గ్రామాలకు విద్యుత్ సదుపాయం కల్పించేందుకు రూ.33.49 కోట్లతో డీపీఆర్ సిద్ధం చేశామని విశాఖపట్నం ఏపీఈపీడీసీఎల్ సర్కిల్ సూపరింటెండెంట్ ఇంజనీర్(ఆపరేషన్) ఎల్.మహేంద్రనాథ్ తెలిపారు. ఆదివారం చింతపల్లి, జీకేవీధి మండలాల్లో ఆయన పర్యటించారు. మూలగరువు గ్రామంలో పీవీటీజీ గృహాలను సందర్శించారు. ఈపీడీసీఎల్ అధికారులు ఏర్పాటు చేసిన విద్యుత్ కనెక్షన్లను పరిశీలించి, ఆదివాసీల అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏపీఈఆర్‌సీ చైర్మన్ జస్టిస్ సీవీ నాగార్జునరెడ్డి పాడేరు డివిజన్ పరిధిలో పీవీటీజీ గ్రామాలకు విద్యుత్ సదుపాయం కల్పించాలని కోరారని చెప్పారు. ఈ మేరకు జిల్లాలో ఈపీడీసీఎల్ అధికారులు సర్వే చేసి 271 గ్రామాలకు కనీసం విద్యుత్ సదుపాయం లేదని గుర్తించారన్నారు. ప్రస్తుతం ప్రతి పీవీటీజీ కుటుంబానికి ఉచితంగా విద్యుత్ మీటరు అమర్చి కనెక్షన్ ఏర్పాటు చేస్తున్నామన్నారు. ప్రతి కుటుంబానికి విద్యుత్ మీటర్, బోర్డు, ఎర్త్‌పైప్, సర్వీసు వైర్ ఉచితంగా అందజేస్తున్నామన్నారు. గిరిజన లబ్ధిదారులకు నెలకు 200 యూనిట్లు ఉచితమన్నారు. జన్‌మన్ పథకం కింద 8,819 మంది పీవీటీజీ లబ్ధిదారులకు విద్యుత్ సదుపాయం కల్పిస్తున్నామని చెప్పారు. ఆయన వెంట చింతపల్లి ఏఈఈ వనుము ప్రభాకరరావు ఉన్నారు.



మూలగరువులో పర్యటిస్తున్న ఏపీఈపీడీసీఎల్ ఎస్ఈ మహేంద్రనాథ్

క్రైం... crime news

రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి



కాశి కనకశ్రీదేవి (ఫైల్ ఫొటో)

కశింకోట, ఫిబ్రవరి 11: మండలంలోని బయ్యవరం బ్రిడ్జి సమీపంలో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ మహిళ అక్కడికక్కడే మృతి చెందింది. ఈ సంఘటనకు సంబంధించి సీఐ కె.వినోద్‌బాబు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. చోడవరం మండలం అంబేరుపురం గ్రామానికి చెందిన కాశి కనకశ్రీదేవి(40), భర్త కాశి రాము ద్విచక్రవాహనంపై ఏటికొప్పాక వెళుతుండగా అనకాపల్లి నుంచి ఎలమంచిలి వైపు వెళుతున్న ఒక కంటైనర్ లారీ ఢీకొంది. ఈ ప్రమాదంలో ద్విచక్రవాహనంపై వెనుక వైపు కూర్చున్న కనకశ్రీదేవి కింద పడి అక్కడికక్కడే మృతి చెందింది. ఆమె భర్త రాముకు స్వల్పంగా గాయాలయ్యాయి. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం అనకాపల్లి ఎన్‌టీఆర్ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. భర్త రాము ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఆయన తెలిపారు. కాగా ప్రమాదానికి కారణమైన లారీ డ్రైవర్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

కలుపు నివారణ మందు తాగి ఒకరి ఆత్మహత్య

కె.కోటపాడు, ఫిబ్రవరి 11: పనికి వెళ్లకుండా ఇంటి వద్దనే ఉంటున్న భర్తను భార్య నిలదీయడంతో మనస్థాపం చెంది కలుపు నివారణ మందు తాగిన ఓ వ్యక్తి మృతి చెందాడు. దీనికి సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలు ఇలా వున్నాయి. మండలంలోని చౌడువాడ గ్రామానికి చెందిన శానాపతి అంజి(37) స్వల్ప అనారోగ్యంతో నెల రోజులుగా పనిలోకి వెళ్లకుండా ఇంటి వద్దనే ఉంటున్నాడు. భర్త పనిలోకి వెళ్లడం లేదని భార్య లక్ష్మి నిలదీయడంతో మనస్థాపం చెంది శనివారం మధ్యాహ్నం వరిచేనుకు వాడే కలుపు నివారణ మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కుటుంబ సభ్యులు స్థానిక 30 పడకల ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో కేజీహెచ్ రిఫర్ చేయగా, అక్కడ ఆదివారం తెల్లవారుజామున మృతి చెందినట్టు కుటుంబ సభ్యులు తెలిపారు. అతనికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

అదుపుతప్పి రెండు కార్లు బోల్తా



అడ్డరోడ్డు సమీపంలో జాతీయ రహదారిపై బోల్తా పడిన కారు



గెడ్డపాలెం రోడ్డు వద్ద జాతీయ రహదారి పక్కన కాలువలోకి దూసుకెళ్లిన కారు

ఎస్.రాయవరం, ఫిబ్రవరి 11: మండలంలోని జాతీయ రహదారిపై ఆదివారం రెండు కార్లు బోల్తా పడ్డాయి. ఈ ప్రమాదాల్లో ఒకరికి స్వల్ప గాయాలైనట్టు హైవే పెట్రోలింగ్ పోలీసులు తెలిపారు. వారు అందించిన వివరాలిలా ఉన్నాయి. విశాఖ నుంచి రాజమండ్రి వెళుతున్న కారు గెడ్డపాలెం రోడ్డు వద్దకు వచ్చే సరికి అదుపుతప్పి జాతీయ రహదారికి పక్కనే ఉన్న కాలువలోకి దూసుకెళ్లింది. కారులో ముగ్గురు ప్రయాణికులతో పాటు డ్రైవర్ ఉండగా, డ్రైవర్‌కి స్వల్ప గాయాలయ్యాయి. అతనిని నక్కపల్లి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అలాగే విజయవాడ నుంచి విశాఖ వెళుతున్న కారు అడ్డరోడ్డు సమీపంలో జాతీయ రహదారిపై అదుపుతప్పి బోల్తా పడింది. ఈ కారు బోల్తా పడిన సమయంలో వెనుక నుంచి వాహనాలు ఏమీ రాకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పిందని స్థానికులు తెలిపారు. కారులో సుమారు ఏడేళ్ల బాలుడితో పాటు అతని తండ్రి ఉన్నారు. ఈ ప్రమాదంలో కారు దెబ్బతిన్నప్పటికీ ఎవరికీ ఎటువంటి ప్రమాదం జరగలేదని స్థానికులు తెలిపారు.

హత్యాయత్నానికి పాల్పడిన మహిళ అరెస్టు

- రిమాండ్‌కు తరలింపు

మాడుగుల రూరల్, ఫిబ్రవరి 11: తన భర్తతో వివాహేతర సంబంధం కలిగి ఉందన్న అనుమానంతో మహిళపై పెట్రోల్ పోసి హత్యాయత్నానికి పాల్పడిన అల్లంగి చిన్నమ్మలును అరెస్టు చేసి కోర్టులో హాజరుపరచగా 14 రోజులు రిమాండ్ విధించినట్టు మాడుగుల ఎస్ఐ దామోదరనాయుడు తెలిపారు. మాడుగుల మండలం తాటిపర్తి పంచాయతీ కాశీపురం గ్రామంలో తన భర్త అల్లంగి పోతురాజుతో వివాహేతర సంబంధం ఉందన్న అనుమానంతో లక్ష్మిపై పోతురాజు భార్య చిన్నమ్మలు పెట్రోల్ పోసి నిప్పటించిన విషయం తెలిసిందే. కాలిన గాయాలతో కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్న బాధితురాలు లక్ష్మి ఫిర్యాదు మేరకు చిన్నమ్మలును అరెస్టు చేసి శనివారం సాయంత్రం చోడవరం కోర్టులో మేజిస్ట్రేట్ ముందు హాజరుపరచగా ఆమెకు 14 రోజులు రిమాండ్ విధించినట్టు ఎస్ఐ దామోదరనాయుడు తెలిపారు.

వేర్వేరు చోట్ల 27 మద్యం బాటిళ్లు స్వాధీనం

పరవాడ, ఫిబ్రవరి 11: లంకెలపాలెం గ్రామానికి చెందిన జోగా నూకాలమ్మ పాన్‌షాపులో మద్యం అమ్మకాలు జరుపుతున్నారని సమాచారం మేరకు ఎస్ఐ సురేశ్ తమ సిబ్బందితో ఆదివారం రాత్రి సోదాలు నిర్వహించారు. షాపులోని గల 15 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. అలాగే ఫార్మాసిటీకి చెందిన నరసింగరావు అనే వ్యక్తి ప్రభుత్వ మద్యం దుకాణం నుంచి 12 బాటిళ్లు కొనుగోలు చేసి తీసుకువెళుతుండగా ఎస్ఐ మల్లేశ్వరరావు లంకెలపాలెం వినాయకనగర్ వద్ద అడ్డగించి అతని నుంచి మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు ఇరువురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐలు సురేశ్, మల్లేశ్వరరావులు తెలిపారు.

గ్రావెల్ అక్రమ తవ్వకాలపై నిగ్గు తేల్చాలి

- మాజీ మంత్రి బండారు డిమాండ్

పరవాడ, ఫిబ్రవరి 11: పరవాడ రెవెన్యూ పరిధి సర్వే నంబరు 11లో గ్రావెల్ అక్రమ తవ్వకాల వ్యవహారంపై నిగ్గు తేల్చాలని మాజీ మంత్రి బండారు సత్యనారాయణమూర్తి డిమాండ్ చేశారు. ఆదివారం రాత్రి ఆయన మాట్లాడుతూ.. పరవాడ సర్వే నంబరు 11లో గ్రావెల్ తవ్వకాలు జరపడం వెనుక ఏపీఐఐసీ జోనల్ మేనేజర్ హస్తం ఉందని ఆరోపించారు. సబ్‌స్టేషన్ పనుల కోసమని గ్రావెల్‌ను తరలిస్తున్నామని జోనల్ మేనేజర్ చెప్పడం దారుణమన్నారు. ఈ వ్యవహారంపై జిల్లా ఉన్నతాధికారులు విచారణ చేపట్టి దోషులపై చర్యలు తీసుకోవాలన్నారు. పోలీసుల అదుపులో ఉన్న వాహనాలను ఎట్టి పరిస్థితుల్లోనూ రిలీజ్ చేయకూడదని డిమాండ్ చేశారు. ఈ వ్యవహారంలో ఎవరెవరి పాత్ర ఉందో ప్రజలకు తెలియజేయాల్సిన బాధ్యత అధికారులపై ఉందని బండారు అన్నారు.

'మోటార్ కార్మికుల సమ్మెను విజయవంతం చేయాలి'



సమ్మె కరపత్రాలను ఆవిష్కరిస్తున్న దృశ్యం

పరవాడ, ఫిబ్రవరి 11: ఈనెల 16న దేశవ్యాప్తంగా చేపట్టనున్న మోటార్ కార్మికుల సమ్మెను విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు గనిశెట్టి సత్యనారాయణ పిలుపునిచ్చారు. సమ్మెకు సంబంధించి కరపత్రాలను ఆటో కార్మికులతో కలిసి ఆదివారం లంకెలపాలెంలో ఆయన ఆవిష్కరించారు. అనంతరం గనిశెట్టి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన బీఎన్ఎస్ 106 సెక్షన్ రద్దు చేయాలని, జీవో నంబరు 21ని పూర్తిగా నిషేధించాలని డిమాండ్ చేశారు. బీఎన్ఎస్ చట్టంలోని కఠినమైన షరతులను మార్పు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆటో యూనియన్ నాయకులు నరసింగరావు, రామారావు, అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.

చికెన్ ధరలు

బ్యాగ్	రూ.లలో
రైతు ధర	117.00
లైవ్ ధర	137.00
విత్ స్కిన్	244.00
స్కిన్ లెస్	254.00

కోడి గుడ్లు (నెక్)

వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	555
విజయనగరం	559
శ్రీకాకుళం	559

పరీక్షా సమయం!

విద్యార్థుల్లో ఆందోళన

- ప్రణాళిక ప్రకారం చదివితే మంచి మార్కులు
- సూచిస్తున్న నిపుణులు
- పిల్లల్లో ఆత్మస్థైర్యం నింపాల్సిన బాధ్యత తల్లిదండ్రులదే...
- ఒత్తిడి తెస్తే ఆరోగ్యంపై ప్రభావం!





విశాఖపట్నం, ఫిబ్రవరి 11: కొద్ది రోజుల్లో ఇంటర్, పదో తరగతి పరీక్షలు ప్రారంభం కానున్నాయి. విద్యా సంవత్సరముగింపు దశలో ఉండడంతో పిల్లలు, తల్లిదండ్రులపై ఒత్తిడి పెరుగుతోంది. మరో పక్క ఉపాధ్యాయులపై యాజమాన్యాలు ఒత్తిడి పెంచుతున్నాయి. సిలబస్ పూర్తి చేయడం, రివిజన్ లాంటివి కొనసాగుతున్నాయి. ఇంతకుముందు పాఠశాలలో విద్యార్థులందరూ పాసైతే మంచి ఫలితాలుగా చూసేవారు. కానీ ప్రస్తుతం ర్యాంకుల గోలతో ఎవరు ఎక్కువ మార్కులు తెచ్చుకుంటారోననే పోటీ పెరిగింది. వెరసి అటు ఉపాధ్యాయులు, ఇటు తల్లిదండ్రులపై ఒత్తిడితో విద్యార్థులకూ ఆందోళన పెరుగుతోంది. మార్కుల ఒత్తిళ్లు కొంప ముంచుతున్నాయని ఓ పక్క ప్రభుత్వం, మానసిక వైద్య నిపుణులు, విద్యావేత్తలు చెబుతున్నా... పోటీ ప్రపంచంలో నెగ్గుకు రావాలంటే ర్యాంకులే ఆలంబనని పాఠశాలల యాజమాన్యాలు భావిస్తున్నాయి. కొంతమంది తల్లిదండ్రులు కూడా ఇదే పంథాలో ఆలోచిస్తున్నారు. నూటికి 99 వస్తే ఆ ఒక్కటీ ఎందుకు పోయిందనే ప్రశ్నే ఉత్పన్నమవుతోంది. పగలూ రాత్రీ తేడా లేకుండా పరీక్షలకు సిద్ధమవడం, ఏం తింటున్నారో, ఏం చేస్తున్నారో తెలియని పరిస్థితుల్లో విద్యార్థుల ఆరోగ్యంపై ప్రభావం పడుతోందని నిపుణులు చెబుతున్నారు.

బాగా చదువుకునే విద్యార్థులు సైతం పరీక్షల ఒత్తిడి కారణంగా అనారోగ్యానికి గురికావడం, ఆస్పత్రుల చుట్టూ తిరగడం చూస్తుంటాం. అందుకే ప్రణాళికా బద్ధంగా చదవడం అలవాటు చేయడమే కాకుండా, ఒత్తిడి లేకుండా చదవడం శ్రేయస్కరమని నిపుణులు సూచిస్తున్నారు. మార్కులొక్కటే ఉన్నత స్థానంలో నిలబెట్టవన్నది గమనించాలి. సంగీత ప్రపంచాన్ని ఓలలాడించి ఆస్కార్ గెలుచుకున్న ఏఆర్ రెహమాన్ చదువులో వెనుకబడేవారు. భౌతిక శాస్త్రంలో నోబెల్ బహుమతి పొందిన అల్బర్ట్ ఐన్‌స్టీన్ చదువులో చాలా వెనుకబడి ఉండేవారు. ఇతడి విషయంలో ఉపాధ్యాయులు తీవ్ర అసంతృప్తితో ఉండేవారు. వరుస విజయాలతో ఆత్మస్థైర్యం పెరుగుతుందేమో కానీ, ఒక్క ఓటమి వచ్చినా తట్టుకోలేని పరిస్థితికి వెళ్లిపోతారు.

ఓటమినే విజయంగా...

విద్యార్థి దశలోనే ఓటమి చవి చూసిన వారు దానిని విజయానికి పది మెట్లుగా మలచుకుంటారు. ఒక్క ఓటమి జీవిత గమనాన్ని నిర్దేశించలేదు. అందుకే పిల్లలకు చదువొక్కటే జీవితం కాదని తల్లిదండ్రులు చెప్పాలి. తద్వారా మానసిక ఒత్తిడి తగ్గించడమే కాకుండా ఫలితాల పట్ల సానుకూల దృక్పథం కలుగుతుంది. మంచి మార్కులు తెచ్చుకోవడానికి ప్రయత్నించమనాలి తప్ప ర్యాంకులకోసం ఒత్తిడి చేయకూడదు. వారిలో ఆ ఆలోచన ఉన్నా, ఫలితాలు ఎలా వచ్చినా అంగీకరించే స్థాయికి తీసుకురావాలి.

తల్లిదండ్రులు ఇలా...

చదువే సర్వస్వం అనుకునే తల్లిదండ్రులూ లేకపోలేదు. వీరు తమ పిల్లల్ని ఏ స్థాయికి తీసుకువెళ్లాలో ముందే నిర్ణయించేసుకుంటారు. ఆ దిశగా ఒత్తిడి చేస్తుంటారు. కొన్నిసార్లు పిల్లలు తమ తల్లిదండ్రుల ఆసక్తి మేరకు... వారు నిర్దేశించిన దారిలోనే వెళ్తారు. కానీ కొందరు ఆయా విభాగాల్లో సరైన ఫలితాలు సాధించలేక చతికిల పడుతుంటారు. సమస్యను తల్లిదండ్రులకు చెప్పలేక, చెప్పినా సరైన స్పందన రాక మానసిక ఒత్తిడిలో ఉంటారు. కొందరు తల్లిదండ్రులు పిల్లలపై ఎలాంటి ఒత్తిడి చేయరు. చదవినంత చదువుకో, నీ భవిష్యత్తు నీ ఇష్టం అన్న రీతిలో ఉంటారు. కేవలం పిల్లల అనుమానాలు, సందేహాలను నిపుణులతో నివృత్తి చేస్తుంటారు. దీనివల్ల వారు ఒక్కో అంశంపై అవగాహన పెంచుకుని ముందుకు వెళ్తుంటారు. తల్లిదండ్రులకు మరో రంగంపై ఆసక్తి ఉంటే, వాటి పట్ల పిల్లల శ్రద్ధ, శక్తి ఏపాటిది అన్నది తెలుసుకుని, మార్గనిర్దేశం చేస్తుంటారు. మరికొందరు తల్లిదండ్రులను చూస్తే మనకే ఆశ్చర్యం వేస్తుంది. వారి పిల్లల్లో ఎవరైనా చదువులో వెనుకబడి ఉన్నా టెన్షన్ పడరు. మార్కుల విషయంలో ఒత్తిడి చేయరు. ఫర్వాలేదులే ఒక్క సబ్జెక్టూ ఫెయిల్ కాకుండా చూసుకో అంటారు. పరీక్షలు అయిపోయాక, ఫలితాలకు ముందు ఒకటో రెండో సబ్జెక్టులు ఉండిపోయినా మళ్లీ అవకాశం ఉంటుందిగా అప్పుడు రాసుకోవచ్చులే అంటారు. వారికి సమాజంపై అవగాహన కల్పిస్తుంటారు. ఇతర అంశాల్లో వీరికి పరిణతి వచ్చేలా జాగ్రత్త పడతారు.

ఏం జరిగితే... ఏమౌతుంది?

పిల్లలు ఏం చేస్తే, ఫలితాలు ఎలా ఉంటాయనేదానిపై ఆలోచన చేస్తూ ఉండాలి. ర్యాంకుల కోసం పోటీ పడుతున్న విద్యార్థికి ఎలా చెప్పాలి, మంచి మార్కుల కోసం తపనపడే పిల్లలకు ఏం చెప్పాలి? అత్తెసరు మార్కులతో చదివేవారికి ఎలా చెప్పాలి? ఇవన్నీ ఆలోచించాలి. తల్లిదండ్రుల ప్రవర్తన బట్టి పిల్లలుంటారు. వారు తమ వంతు ప్రయత్నం చేస్తారు. ఒక వేళ పరీక్ష తప్పినా తల్లిదండ్రులు తిట్టరనే భావన ఉంటుంది. పిల్లలు తప్పుదారిన వెళ్లకుండా చూసుకోవడం తల్లిదండ్రుల బాధ్యత. మరి కొందరు తల్లిదండ్రులు విద్య అవసరమే కానీ జీవితం ఆగిపోదని పిల్లలను అనునయిస్తారు. ఫలితాల ముందు మరింత స్పష్టంగా ఉంటారు. చదువే సర్వస్వం కాదని, జీవితం ముఖ్యమని వారికి అర్థమయ్యేలా చెప్పడంతో పాటు, మేమున్నది మీకోసమేననే సంకేతాలను ఇస్తారు.

ఘనంగా రాష్ట్ర స్థాయి ఘంటసాల పాటల పోటీలు



ఘంటసాల చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న కమిటీ ప్రతినిధులు



సీనియర్ విభాగం విజేత తరఫున మాజీ ఎమ్మెల్సీ పప్పల చలపతిరావు నుంచి బహుమతి అందుకుంటున్న కమిటీ ప్రతినిధులు

ఎలమంచిలి, ఫిబ్రవరి 11: స్థానిక ఘంటసాల కళామందిర్ ఆవరణలో ఆదివారం ఘంటసాల వర్ధంతిని పురస్కరించుకుని రాష్ట్ర స్థాయి ఘంటసాల పాటల పోటీలను ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచి జరిగిన పాటల పోటీలకు తెలంగాణ, ఆంధ్ర రాష్ట్రాల నుంచి సీనియర్, జూనియర్ విభాగాల్లో మొత్తం 42 మంది కళాకారులు పాల్గొని ఘంటసాల పాటలను ఆలపించారు. సాయంత్రం నిర్వహించిన సంగీత విభావరిలో స్థానిక కళాకారులు మత్తుర్తి రామారావు, ఉపాధ్యాయుడు నాగేశ్వరావు, ఆర్‌వీ ఆంజనేయులు, సాంబశివరావు తదితరులు ఆలపించిన గీతాలకు ప్రేక్షకుల నుంచి విశేష స్పందన లభించింది. అనకాపల్లికి చెందిన ఈల పాట కళాకారుడు తన ఈల పాటతో ఆద్యంతం అందరినీ అలరించారు. ఈ సందర్భంగా ఆయనను, స్థానిక చార్టెర్డ్ అక్కౌంటెంట్ బీఎస్ బంగారుశెట్టిలను ఘనంగా సత్కరించారు. అంతకు ముందుకు ఘంటసాల చిత్రపటానికి చైర్‌పర్సన్ రమాకుమారి, ఘంటసాల కల్చరల్ అసోసియేషన్ ప్రతినిధులు నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ పప్పల చలపతిరావు, ఎంపీపీ బోదెపు గోవింద్, కమిటీ ప్రతినిధులు, సభ్యులు ఆడారి పూరి జగన్నాధం, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

విజేతలు వీరే..

ఈ పోటీల్లో సీనియర్ విభాగంలో వీఎస్ఎస్ శర్మ(ప్రథమ), జి.భవానీ(ద్వితీయ), కె.జగదీశ్వరి(తృతీయ)స్థానాలను కైవసం చేసుకున్నారు. జూనియర్ విభాగంలో సీహెచ్ పవిత్ర(ప్రథమ), ఎం.మణిదీప్(ద్వితీయ), కె.దివ్యశ్రీ(తృతీయ)స్థానాలకు దక్కించుకున్నారని నిర్వాహకులు తెలిపారు. పోటీలకు న్యాయనిర్ణేతలుగా రామారావు, సత్యనారాయణ, పవన్‌లు వ్యవహరించారు.

దిశ మహిళా పోలీస్ స్టేషన్ డీఎస్పీగా ఉపేంద్రబాబు బాధ్యతల స్వీకారం



డీఎస్పీ ఉపేంద్రబాబు

అనకాపల్లి టౌన్, ఫిబ్రవరి 11: అనకాపల్లి దిశ మహిళా పోలీస్‌స్టేషన్ డీఎస్పీగా ఎం.ఉపేంద్రబాబు ఆదివారం బాధ్యతలు చేపట్టారు. కర్నూలు సీసీఎస్ సీఐగా పనిచేసిన ఆయనకు ప్రభుత్వం డీఎస్పీగా పదోన్నతి ఇచ్చి దిశ మహిళా పోలీస్‌స్టేషన్‌కు బదిలీ చేయడంతో ఆయన బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పనిచేసిన డీఎస్పీ ఎం.మహేశ్వరరావు అమలాపురానికి బదిలీ అయిన సంగతి తెలిసిందే. ఈ సందర్భంగా డీఎస్పీ ఉపేంద్రబాబు మాట్లాడుతూ మహిళా చట్టాలపై కళాశాలల్లో అవగాహన సదస్సులు ఏర్పాటు చేస్తామన్నారు.

'ఎన్నికల్లో మత్స్యకారులకు టికెట్లు కేటాయించాలి'



నక్కపల్లిలో సమావేశమైన ఆంధ్ర మత్స్యకార జేఏసీ సభ్యులు

నక్కపల్లి, ఫిబ్రవరి 11 : వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో ఎంపీ, ఎమ్మెల్యే స్థానాలకు ఎక్కువ మంది మత్స్యకారులకు ప్రధాన రాజకీయ పార్టీలు టికెట్లు ఇచ్చి రాజకీయ ప్రాధాన్యత కల్పించాలని ఆంధ్ర మత్స్యకార జేఏసీ సంఘం తీర్మానించింది. ఈ మేరకు ఆదివారం స్థానిక నూకాంబిక అమ్మవారి ఆలయంలో సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కంబాల అమ్మోరియ్య నేతృత్వంలో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ ఏపీలో 30 లక్షల జనాభా ఉన్న మత్స్యకారులకు పార్లమెంటు, అసెంబ్లీ ఎన్నికల్లో టికెట్లు కేటాయించాలని డిమాండ్ చేశారు. మత్స్యకారులను ఎస్టీ జాబితాలో చేర్చాలని, జీఓ నం.217ను రద్దు చేయాలన్నారు. అదే విధంగా తగిన గుర్తింపునివ్వాలని, లేకుంటే ఆయా పార్టీలకు తగిన గుణపాఠం చెబుతామన్నారు. సంఘం నాయకులు ఆర్జిల్లి అప్పలరాజు, చోడిపిల్లి వెంకటేశ్, జి.నూకరాజు, పి.లోకనాథం, ప్రశాంత్, రాజేశ్, శ్రీను, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రానికి మేలు జరగాలంటే టీడీపీ ప్రభుత్వం రావలసిందే..

- తెలుగు మహిళ రాష్ట్ర అధ్యక్షురాలు అనిత



దివ్యాంగుడితో మాట్లాడుతున్న అనిత

ఎస్. రాయవరం, ఫిబ్రవరి 11: రాష్ట్రానికి మేలు జరగాలంటే టీడీపీ ప్రభుత్వం రావాలని తెలుగు మహిళ రాష్ట్ర అధ్యక్షురాలు వంగలపూడి అనిత అన్నారు. మండల కేంద్రంలో ఆదివారం ఆమె పర్యటించి, పల్లె పలకరింపు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అనిత గ్రామంలో ఇంటింటికీ తిరుగుతూ ప్రజల సమస్యలను, కష్టాలను అడిగి తెలుసుకోవడమే కాకుండా సూపర్ సిక్స్ పథకాల కరపత్రాలు పంచారు. వైసీపీ ప్రభుత్వం వల్ల ప్రజలకు, రాష్ట్రానికి తీరని నష్టం జరిగిందని, ప్రజలకు, రాష్ట్రానికి మంచి జరగాలంటే రానున్న ఎన్నికల్లో టీడీపీ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసుకోవాలని అనిత పిలుపునిచ్చారు. గ్రామానికి విచ్చేసిన అనితకు మహిళలు హారతులతో ఘనస్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నేతలు కందుల వెంకటేశ్వరరావు, తుంపాల నాగేశ్వరరావు, గుర్రం రామకృష్ణ, వజ్రపు శంకరరావు తదితరులు పాల్గొన్నారు.

తహసీల్దార్ హత్యకేసు దర్యాప్తుపై ఉన్నతస్థాయి ఒత్తిళ్లు!

- కస్టడీలో నిందితుడు గంగారావు వెల్లడించిన అంశాలపైనా గోప్యత
- తెరవెనుక సూత్రధారులు తప్పించుకున్నట్టేనని ప్రచారం
- పోలీసుల తీరుపై రెవెన్యూ ఉద్యోగుల్లో అనుమానం!

విశాఖపట్నం, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం సృష్టించిన తహసీల్దార్ రమణయ్య హత్య కేసు దర్యాప్తుపై పోలీసులకు ఉన్నతస్థాయి నుంచి ఒత్తిళ్లు పెరిగినట్టు ప్రచారం జరుగుతోంది. విశాఖపట్నం రూరల్ తహసీల్దార్‌గా పనిచేసిన సనపల రమణయ్యకు విజయనగరం జిల్లా బొండపల్లి బదిలీ కావడం, అక్కడ బాధ్యతలు స్వీకరించి ఇంటికి చేరుకున్న అతడ్ని రాత్రి పది గంటల సమయంలో మురారీ సుబ్రహ్మణ్యం గంగారావు ఇనుపరాడ్‌తో తలపై మోది హత్య చేసిన విషయం తెలిసిందే. ఈ ఘటన జరిగిన మరుసటిరోజే నిందితుడిని అదుపులోకి తీసుకున్న పోలీసులు రిమాండ్‌కు తరలించగా, వారి అభ్యర్థన మేరకు కోర్టు కస్టడీకి అనుమతించింది.

పోలీసులు గంగారావును పట్టుకున్న ఒకరోజు వ్యవధిలోనే అరెస్టు చేసి, రిమాండ్‌కు పంపడంతో వివరాలను రాబట్టడానికి అవకాశం లేదనుకున్నా... తర్వాత నాలుగు రోజుల కస్టడీకి కోర్టు అనుమతించింది. ఇప్పటికే మూడు రోజులు గడిచిపోయాయి. డీసీపీ స్థాయి అధికారి పర్యవేక్షణలో ఏసీపీ, సీఐ మరికొంతమంది సిబ్బంది గంగారావును విచారిస్తున్నారు. సీపీ రవిశంకర్ అయ్యనార్ కూడా శనివారం పీఎంపాలెం పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి విచారణ జరుగుతున్న తీరును పరిశీలించారు. అయితే ఇంతవరకూ పోలీసులు సేకరించిన సమాచారం బయటకు చెప్పకపోవడం ఆశ్చర్యానికి గురిచేస్తోంది. అంతేకాకుండా విచారణలో వెల్లడించిన అంశాలేవీ బయటకు తెలియడానికి వీల్లేదని, ఒకవేళ లీక్ అయితే బాధ్యులపై తీవ్ర చర్యలు ఉంటాయని ఉన్నతాధికారులు హెచ్చరించడంతో సిబ్బంది విచారణ జరుగుతున్న గదివైపు వెళ్లడానికి కూడా భయపడిపోతున్నారని సమాచారం.

తెరవెనుక సూత్రధారులెవరు?

పెదరుషికొండలోని సర్వేనంబరు 380/1లోని కొంతభాగంలో నిర్మించిన అపార్ట్‌మెంట్‌కు సంబంధించిన స్థలానికి కన్వేయెన్స్‌డీడ్ జారీ విషయమే హత్యకు దారితీసిందని పోలీసులు ప్రకటించారు. గంగారావు ఒక రియల్‌ఎస్టేట్, కన్‌స్ట్రక్షన్ కంపెనీలో మేనేజర్‌గా పనిచేస్తున్నాడని నగర పోలీస్ కమిషనర్ రవిశంకర్ అయ్యనార్ వెల్లడించారు. దీనిని బట్టి గంగారావుకు వ్యక్తిగతంగా తహసీల్దార్‌తో ఎలాంటి లావాదేవీలు నిర్వహించాల్సిన అవసరం లేదని ఆయన మాటలను బట్టి తెలుస్తోంది. అయితే గంగారావు ఎవరి కోసం కన్వేయెన్స్‌డీడ్ జారీకి తహసీల్దార్‌ను సంప్రదించాడనేది తేలాల్సి ఉంది. అలాగే కన్వేయెన్స్‌డీడ్ జారీ కోసం గంగారావు తహసీల్దార్‌కు భారీగా డబ్బులు ముట్టజెప్పాడని ప్రచారం జరుగుతోంది. అది వాస్తవమైతే అంతమొత్తం గంగారావుకు ఆ డబ్బు ఎవరు ఇచ్చారనేది తేలాల్సి ఉంటుంది. మరోవైపు రమణయ్యకు విజయనగరం జిల్లాకు బదిలీ అయిపోవడంతో ఇంక పని జరగదనే ఆక్రోశంతో గంగారావుకు డబ్బులు సమకూర్చినవారే తహసీల్దార్‌ను హత్య చేయాలనో... దాడి చేసి బెదిరించాలనో.. ప్రోత్సహించే అవకాశం ఉందంటున్నారు. వీటన్నింటిపైనా పోలీసులు దృష్టిపెడితే ఒక్క రోజులోనే వాస్తవాలు బయటపడతాయని భావిస్తున్నారు.

ఉన్నత స్థాయిలో ఒత్తిడి

రుషికొండలోని తారకరామ లేఅవుట్ ప్రాంతంలోని సుమారు 50 ఎకరాల భూమిని వీఎంఆర్‌డీఏ ఒక సంస్థకు కేటాయించింది. ఆ భూమి పలువురి చేతులు మారి ప్రస్తుతం అధికారపార్టీలోని కీలకనేత బంధువు ఆధీనంలోకి వెళ్లింది. ఆ భూముల్లో నిర్మాణాలు ప్రారంభించిన ఆ కీలకనేత బంధువు నిర్మాణ బాధ్యతలను ప్రస్తుతం గంగారావు పనిచేస్తున్న సంస్థకు అప్పగించినట్టు సమాచారం. నిర్మాణ పనులు జరుగుతుండగానే ఆ భూములు మరోసారి అధికారపార్టీకి చెందిన రాయలసీమ నేత చేతుల్లోకి వెళ్లిపోవడంతో బాధ్యతల నుంచి గంగారావు పనిచేస్తున్న సంస్థను తప్పించారు. తాజాగా తహసీల్దార్ రమణయ్య హత్య నేపథ్యంలో హత్యకు పాల్పడిన గంగారావుతోపాటు తనను కూడా పోలీసులు అరెస్ట్ చేస్తారనే భయంతో గంగారావు పనిచేస్తున్న సంస్థ యజమాని గతంలో అధికారపార్టీకి చెందిన కీలకనేత బంధువును సంప్రదించినట్టు ప్రచారం జరుగుతోంది. ఆ కీలకనేత బంధువు పోలీస్ ఉన్నతాధికారులపై ఒత్తిడి చేయడం వల్లే కేసు దర్యాప్తులో వేగం తగ్గినట్టు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. కేసును కొంతకాలం నాన్చిన తర్వాత గంగారావు ఒక్కడే నిందితుడని, హత్య వెనుక మరెవరి ప్రమేయం, ప్రోత్సాహం లేదని పోలీసులు ప్రకటించినా ఆశ్చర్యపోనక్కర్లేదని పలువురు రెవెన్యూ శాఖ ఉద్యోగులే అభిప్రాయపడుతున్నారు. ఈ నేపథ్యంలో పోలీసుల తీరుపై వారు పలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు.

నేటి నుంచి రెవెన్యూ ఉద్యోగుల పెన్‌డౌన్

- తహసీల్దారు హత్యపై ప్రభుత్వ స్పందన శూన్యమని ఆవేదన

విశాఖపట్నం, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): విశాఖ రూరల్ తహసీల్దారు ఎస్.రమణయ్య హత్య జరిగి పదిరోజులు గడుస్తున్నా ప్రభుత్వం నుంచి స్పందన లేకపోకపోడంపై రెవెన్యూ అసోసియేషన్ తీవ్ర ఆందోళన వ్యక్తంచేసింది. ఈ మేరకు ఆదివారం విశాలాక్షినగర్‌లో నిర్వహించిన రెవెన్యూ హౌస్ బిల్డింగ్ సొసైటీ సాధారణ సమావేశంలో రమణయ్య హత్యపై సభ్యులు చర్చించారు. తహసీల్దారు హత్యకు గురైన తరువాత రెవెన్యూ ఉద్యోగులు ధైర్యంగా విధులు నిర్వహించలేకపోతున్నారని, ప్రభుత్వ ఆస్తులు కాపాడేందుకు వెనుకాడుతున్నారని పలువురు ఆవేదన వ్యక్తం చేశారు. రమణయ్య హత్యను ఖండిస్తూ, ఆయన కుటుంబానికి ఎక్స్‌గ్రేషియాతోపాటు అతని సతీమణికి గ్రూప్-2 ఉద్యోగం, ఇంటి స్థలం ఇవ్వాలని డిమాండ్ చేశారు. రమణయ్య హత్య పై ప్రభుత్వం స్పందించే వరకు సహాయ నిరాకరణ చేస్తామని స్పష్టం చేశారు. ఇందులో భాగంగా సోమవారం నుంచి పెన్‌డౌన్ చేసేందుకు సమావేశం ఏకగ్రీవంగా తీర్మానించింది.

రెవెన్యూ ఉద్యో గుల సొసైటీ అధ్యక్షుడు కృష్ణకిశోర్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఏపీ జేఏసీ అమరావతి విశాఖ జిల్లా ఛైర్మన్ సత్తి నాగేశ్వరరెడ్డి, రెవెన్యూ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు ఎస్ఏ త్రినాథరావు, కలెక్టరేట్ రెవెన్యూ ఉద్యోగుల సం ఘం అధ్యక్షడు బెహరా రవిశంకర్, ఎన్జీవో సం ఘం నగర కార్యదర్శి సత్యనారాయణ, నాలుగో తరగతి ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు నమ్మి శ్రీనివాసరావు, రిటైర్డు రెవెన్యూ ఉద్యోగుల సంఘం కార్యదర్శి ఎం.మధుసూదనరావు, అధిక సంఖ్యలో ఉద్యోగులు పాల్గొన్నారు.



నినాదాలు చేస్తున్న రెవెన్యూ సంఘ ప్రతినిధులు

శంఖారావాన్ని విజయవంతం చేద్దాం..

» సూపర్‌-6 పథకాలపై ప్రజలను చైతన్యపరుద్దాం

» టీడీపీ పాడేరు అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జి గిడ్డి ఈశ్వరి

పాడేరు రూరల్‌, ఫిబ్రవరి 11: తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్‌ చేపట్టే శంఖారం కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు టీడీపీ శ్రేణులు ముందుకు రావాలని పార్టీ పాడేరు అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరి పిలుపునిచ్చారు. కుమ్మరిపుట్టులోని నివాస గృహంలో ఆదివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబునాయుడు 2024లో రాష్ట్ర ప్రజల జీవితాన్ని మార్చే అద్భుతమైన సూపర్‌-6 పథకాలు ఏర్పాటు చేశారన్నారు. దాన్ని ప్రజల్లోకి తీసుకు వెళ్లేందుకు లోకేశ్‌ చేపట్టిన శంఖారావం ఎంతగానో దోహదపడుతుందన్నారు. సూపర్‌-6 పథకాలతో రాష్ట్రంలో విద్యార్థినీ, విద్యార్థులకు, నిరుద్యోగ యువతకు, మహిళలకు, రైతులకు లబ్ధి చేకూరుతుందన్నారు. బాబు షూరిటీ.. భవిష్యత్‌ గ్యారంటీ ద్వారా చంద్రబాబు నాయుడు పెట్టిన సూపర్‌-6 పథకాలను రాష్ట్రంలో ప్రతీ కుటుంబానికి చేరువ చేసేందుకు పార్టీ శ్రేణులంతా నడుం బిగించాలని ఆమె కోరారు. సైకో జగన్‌ అరాచక పాలనను ఎండగట్టేందుకు లోకేశ్‌ చేపట్టిన శంఖారావానికి తరలిరావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో తెలుగు యువత నియోజకవర్గ అధ్యక్షుడు డప్పోడి వెంకటరమణ, టీడీపీ నేత కూడి రామునాయుడు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్‌ గిడ్డి ఈశ్వరి

వైసీపీ ప్రభుత్వాన్ని గద్దె దించేందుకు ప్రజలు సిద్ధం

గూడెంకొత్తవీధి: వైసీపీ ప్రభుత్వాన్ని గద్దె దించేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని టీడీపీ నాయకుడు కొట్టగుళ్లి సుబ్బారావు అన్నారు. మండలంలోని లక్కవరపుపేట, సంకాడ పంచాయతీ కేంద్రాల్లో బాబు ష్యూరిటీ.. భవిష్యత్‌ గ్యారంటీ కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగన్‌రెడ్డి నియంత పాలనపై విసుగెత్తిపోయిన ప్రజలు ఎన్నికలు ఎప్పుడు వస్తాయా అని



దేవరాపల్లిలో గిరిజనులతో మాట్లాడుతున్న కొట్టగుళ్లి సుబ్బారావు

ఎదురుచూస్తున్నారన్నారు. ఐదేళ్లలో వైసీపీ ప్రభుత్వం ప్రజల విశ్వాసాన్ని కోల్పోయిందన్నారు. రాష్ట్రం బాగుపడాలంటే మళ్లీ చంద్రబాబు సీఎం కావాలని కోరుకుంటున్నారన్నారు. ప్రస్తుతం టీడీపీకి ప్రజాదరణ భారీగా పెరిగిందని, వచ్చే ఎన్నికల్లో వైసీపీ ప్రభుత్వానికి ప్రజలు గుణపాఠం చెబుతారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు ముక్కలి మహేశ్‌, దేవరాపల్లి సర్పంచ్‌ బుజ్జిబాబు, కంకిపాటి వీరన్నపడాల్‌, పాపారావు, వినోద్‌, కల్యాణి పాల్గొన్నారు.



మోదకొండమ్మను దర్శించుకుంటున్న భక్తులు

కిటకిటలాడిన మోదకొండమ్మ ఆలయం

పాడేరు రూరల్‌, ఫిబ్రవరి 11: ఉత్తరాంధ్ర ప్రజల ఆరాధ్య దైవం పాడేరు మోదకొండమ్మ ఆలయం, పాడేరు ఘాట్‌లోని అమ్మవారి పాదాలు ఆదివారం భక్తులు, పర్యాటకులతో కిటకిటలాడాయి. మన్యం, మైదాన ప్రాంతానికి చెందిన వివిధ గ్రామాల భక్తులతో పాటు వంజంగి, కొత్తపల్లి పర్యాటక ప్రాంతాల సందర్శనకు వచ్చే పర్యాటకులు అమ్మవారి దర్శనానికి బారులు తీరారు. ఆలయానికి వచ్చిన భక్తులకు ఆలయ ప్రధాన కార్యదర్శి కొట్టగుళ్లి సింహాచలంనాయుడు ఆధ్వర్యంలో ఆలయ కమిటీ ప్రతినిధులు ప్రసాదం పంపిణీ చేశారు. మోదకిరణ్‌ మణికంఠ అన్నదాన ట్రస్టు చైర్మన్‌ శివరాత్రి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో సభ్యులు భక్తులకు మధ్యాహ్నం అన్న ప్రసాదాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో సభ్యులు కొట్టగుళ్లి రామారావు, కారం దేముడు, బీవీఎస్‌.ముకుందరావు, కొండలరావు, రాజు తదితరులు పాల్గొన్నారు.

మహాశివరాత్రి ఉత్సవ కమిటీ నియామకం



శివరాత్రి ఉత్సవాల నిర్వహణపై సమావేశమైన కమిటీ ప్రతినిధులు

హుకుంపేట, ఫిబ్రవరి 11: మత్స్యలింగేశ్వరస్వామి ఆలయంలో నిర్వహించనున్న మహాశివరాత్రి ఉత్సవాల కోసం ఆదివారం కమిటీని ఎన్నుకున్నారు. మత్స్యలింగేశ్వర ఆలయం వద్ద గ్రామస్థులతో సమావేశం నిర్వహించి ఈ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కమిటీ అధ్యక్షులుగా మినుముల గోపలపాత్రుడు ప్రధాన కార్యదర్శిగా పాంగి మత్యకొండబాబు, ఉపాధ్యక్షులుగా వంతల ఈశ్వరరావు, కోశాధికారిగా తమర్బ భీమ్‌బాబుతో పాటు మరి కొంత మంది కమిటీ సభ్యులను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా మఠం సర్పంచ్‌ శాంతికుమారి మాట్లాడుతూ ఉత్సవాలను విజయవంతం చేయడానికి అందరూ సహకరించాలని కోరారు. ఉత్సవాలకు భక్తులు అధిక సంఖ్యలో తరలిరావాలని పిలుపునిచ్చారు. ఉత్సవ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు మాట్లాడుతూ వచ్చే నెల 7వ తేదీ నుంచి మూడు రోజుల పాటు జరిగే ఈ ఉత్సవాలను విజయవంతం చేయడానికి కృషి చేస్తామన్నారు ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు తమర్బ అప్పారావు, చంద్రశేఖర్‌నాయుడు, కేశవరావు, సూర్యప్రకాష్‌ తదితరులు పాల్గొన్నారు

పర్యాటకుల సందడి

... 5వ పేజీ తరువాయి

సందడి ప్రారంభమైంది. చెరువులవేనం వ్యూపాయింట్‌ వద్ద పచ్చని కొండలను తాకుతూ పయనించే మంచు మేఘాలు వీక్షకులను అమితంగా ఆకట్టుకున్నాయి. చెరువులవేనం ప్రకృతి అందాలను కెమెరాల్లో బంధించేందుకు సందర్శకులు పోటీ పడ్డారు. వణికించే చలిలో మంచు అందాలను తిలకిస్తూ పర్యాటకులు ఎంజాయ్‌ చేశారు. సాయంత్రం వరకు లంబసింగి, పరిసర పర్యాటక ప్రాంతాలు సందర్శకులతో రద్దీగా కనిపించాయి.

నిరుపేద కుటుంబాల్లో మద్యం చిచ్చు

... 5వ పేజీ తరువాయి

మద్యానికే ఖర్చు చేసేస్తున్నారు. దీంతో కుటుంబ సభ్యులు ఇబ్బందులు పడుతున్నారు.

తాగాలనిపిస్తుండడం వల్లే...

ఈ మధ్య కాలంలో తాగుడుకు బానిసలుగా మారిన వారి సంఖ్య పెరుగుతున్నట్టు మానసిక వైద్యులు చెబుతున్నారు. గతంలో కాస్తో, కూస్తో తాగేవారని, ఇప్పుడు పరిధికి మించి తాగుతూ ఇష్టం వచ్చినట్టు వ్యవహరిస్తున్నారంటూ మద్యానికి బానిసైన వారిని కుటుంబ సభ్యులు మానసిక వైద్యుల వద్దకు తీసుకువెళుతున్నారు. ప్రతి పది కేసుల్లో కనీసం నాలుగు అవే ఉంటున్నాయని ప్రముఖ మానసిక వైద్య నిపుణులు ఎన్‌ఎన్‌ నిహాల్‌ తెలిపారు. కొంతమంది ఉదయం మొదలుపెట్టి రాత్రి పడుకునేంత వరకు తాగుతూనే ఉంటున్నారని, అటువంటి వారికి శారీరక ఆరోగ్యంతోపాటు మానసిక ఆరోగ్యం దెబ్బతింటుందని ఆయన వెల్లడించారు.

ఊటనీరే దిక్కు



కొయ్యూరు: ఊట నీరు తీసుకు వెళుతున్న మహిళలు

... 5వ పేజీ తరువాయి

ఎటువంటి చర్యలు చేపట్టలేదు. దీంతో ఊరికి దూరంగా ఉన్న ఊట గొయ్యి వద్దకు వెళ్లి నీళ్లు తెచ్చుకుంటున్నారు. కలుషిత నీరు వల్ల అనారోగ్యం బారిన పడతామని తెలిసీ గత్యంతరం లేక ఆ నీళ్లనే తాగుతున్నారు. దీనిపై ఆర్‌డబ్ల్యూఎస్‌ జేఈ విశ్వతేజను ఫోన్‌లో సంప్రతించగా వాలుగూడెంలో తాగునీటి సమస్య తన దృష్టికి రాలేదన్నారు. త్వరలో ఆ గ్రామాన్ని సందర్శించి తప్పిన బోరును వినియోగంలోకి తెచ్చేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

వారపు సంత వెలవెల.. వ్యాపారులు విలవిల!

» కూరగాయలు అమ్ముడుకాక నిరాశతో వెనుదిరిగిన మాలీలు

సీలేరు, ఫిబ్రవరి 11: గూడెంకొత్తవీధి మండలంలోని మేజర్‌ పంచాయతీ సీలేరులో ఆదివారం జరిగిన వారపు సంత వెలవెలబోయింది. సీలేరు సంతకు ఆంధ్రా, ఒడిశా సరిహద్దు గ్రామాల నుంచి గిరిజనులు ప్రతీ ఆదివారం వచ్చి, వారికి కావాల్సిన నిత్యావసర వస్తువులను వారానికి సరిపడా కొనుగోలు చేసుకుని వెళ్తుంటారు. ఈ సంతలో సీలేరులోని చింతూరు, కూనవరం, ఒడిశాలోని బలిమెల, కలిమెల, నర్సీట్నం ప్రాంతాల వ్యాపారులతో పాటు మండలంలోని దుప్పులవాడ, దారకొండ, జీకే వీధి ప్రాంతాల నుంచి మాలీలలు పండిన కూరగాయలను కూడా దుకాణాలను పెట్టి గిరిజన మాలీలు విక్రయిస్తారు. అయితే గిరిజన మాలీలు తీసుకువచ్చిన ఆకుకూరలు, కూరగాయలు తాజాగా ఉంటాయి.ఇదీంతో ఈ ప్రాంత ప్రజలు గిరిజన మాలీలు తెచ్చిన కూరగాయలను కొనుగోలు చేయడానికి ఎక్కువగా ఎగబడతారు. సాయంత్రానికల్లా మాలీలు తెచ్చిన కూరగాయలను అమ్ముకుని ఖాళీ సంచులతో వెళ్లిపోతారు. అయితే ఈ వారం సీలేరు వారపు సంతకు ఒడిశా, ఇతర ప్రాంతాల నుంచి సంతకు అధిక సంఖ్యలో హాజరుకాకపోవడంతో మాలీలు తీసుకువచ్చిన సరకులు అమ్ముడుకాలేదు. ఉదయం



సీలేరు వారపు సంతలో కొనుగోలుదారులు లేక వెలవెలబోతున్న దుకాణాలు

నుంచి గిరిజనుల వద్ద కూరగాయలు కొనేవారు లేక దుకాణాలన్నీ వెలవెలబోయాయి. సాయంత్రం ఉన్న సరకులను తక్కువ రేట్లకు అమ్ముదామన్నా కొనేవారు లేకపోవడంతో గిరిజన మాలీ వ్యాపారులు నిరాశతో వెనుదిరిగారు.

బీసీ వెల్ఫేర్‌ హాస్టల్‌లో మరుగుదొడ్డి నిర్మిస్తాం

చేయూత వారియర్స్‌ ట్రస్టు చైర్మన్‌ రమణ

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్‌

చింతపల్లి, ఫిబ్రవరి 11: బీసీ వెల్ఫేర్‌ వసతి గృహంలో వ్యక్తిగత నిధులతో మరుగుదొడ్డి నిర్మించనున్నట్టు చేయూత వారియర్స్‌ ట్రస్టు చైర్మన్‌ దూనబోయిన రమణ తెలిపారు. బీసీ వెల్ఫేర్‌ వసతి గృహం విద్యార్థినులు ఎదుర్కొంటున్న సమస్యలను వివరిస్తూ 'నరకమా.. లేక వసతి గృహమా' అన్న శీర్షికన 'ఆంధ్రజ్యోతి'లో శనివారం ప్రత్యేక కథనం ప్రచురించిన విషయం తెలిసిందే. ఈ కథనానికి స్పందించిన చేయూత వారియర్స్‌ ట్రస్టు సభ్యులు ఆదివారం వసతి గృహాన్ని సందర్శించి విద్యార్థినులు సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా చైర్మన్‌ మాట్లాడుతూ వసతి గృహంలో 87 మంది విద్యార్థినులకు ఒకే మరుగుదొడ్డి, స్నానపు గది ఉండడం, గదులకు తలుపులు లేకపోవడం బాధకరమన్నారు. వారియర్స్‌ సభ్యుల సహకారంతో వసతిగృహం ఆవరణలో ఒక మరుగుదొడ్డి, స్నానపు గది నిర్మిస్తామని ఆయన హామీ ఇచ్చారు. బీసీ వెల్ఫేర్‌ వసతి గృహం అభివృద్ధికి, విద్యార్థినులకు కనీస సదుపాయాలు కల్పించేందుకు స్వచ్ఛంద సంస్థలు ముందుకు రావాలని ఆయన కోరారు. అలాగే వర్తక సంఘం నుంచి బీసీ వెల్ఫేర్‌ వసతి గృహం విద్యార్థినుల అభివృద్ధికి తమవంతు సహకారం అందిస్తామని



విద్యార్థినులతో మాట్లాడుతున్న చేయూత వారియర్స్‌ చైర్మన్‌ రమణ

వర్తక సంఘం ప్రధాన కార్యదర్శి పెదిరెడ్ల బేతాళుడు తెలిపారు. ఈ కార్యక్రమంలో ట్రస్టు సభ్యులు ఈరెల్లి రాజేశ్‌, కటారి సత్యనారాయణ, నల్లల లోవరాజు, గోవింద పాల్గొన్నారు.

దీన్‌ దయాల్‌ ఆశయాలు నెరవేర్చడమే లక్ష్యం



పండిట్‌ దీన్‌ దయాల్‌ ఉపాధ్యాయ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న బీజేపీ నాయకులు

పాడేరు రూరల్‌, ఫిబ్రవరి 11: బీజేపీ సిద్ధాంత కర్త పండిట్‌ దీన్‌ దయాల్‌ ఆశయాలు నెరవేర్చడమే ప్రధాని నరేంద్ర మోదీ ప్రభుత్వ ధ్యేయమని బీజేపీ గిరిజన మోర్చ రాష్ట్ర అధ్యక్షుడు కురుసా ఉమామహేశ్వరరావు అన్నారు. స్థానిక బీజేపీ గిరిజనమోర్చ కార్యాలయంలో దీన్‌ దయాల్‌ వర్ధంతిని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా అతని చిత్రపటానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ.. ఏకాత్మ మానవతా వాద సిద్ధాంతాన్ని, అంత్యోదయ మంత్రాన్ని అందించిన మహనీయుడు దీన్‌ దయాల్‌ అన్నారు. దీన్‌ దయాలు ఆశయ సాధనకు ప్రతీ ఒక్కరూ కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీజేపీ గిరిజన మోర్చ రాష్ట్ర మేధావుల కన్వీనర్‌ కురుసా పార్వతమ్మ, మైనార్టీ మోర్చ రాష్ట్ర కార్యదర్శి పెనుమాక రవికుమార్‌, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కాకర చిన్నయ్య, నందోలి ఉమామహేష్‌ తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదమని తెలిసినా తప్పని ప్రయాణం

» ఆర్టీసీ బస్సు సదుపాయాల లేక రవాణాకు గిరిజనుల అగచాట్లు

» ఆటోలు, జీపుల్లో పరిమితికి మించిన ప్రయాణికులతో రాకపోకలు

» వేలాడుతూ ప్రయాణం.. పట్టు జారితే ప్రమాదం



ప్రైవేటు వాహనంలో వేలాడుతూ ప్రమాదకరంగా ప్రయాణిస్తున్న గిరిజనులు

డుంబ్రిగుడ, ఫిబ్రవరి 11: మారుమూల ప్రాంత గిరిజన గ్రామాల్లో రహదారులు ఉన్నా ఆర్టీసీ బస్సు సౌకర్యం లేక గిరిజనులకు రవాణా కష్టాలు తప్పడం లేదు. దీంతో ప్రమాదమని తెలిసినా తప్పని పరిస్థితిలో ప్రమాదరంగా ప్రైవేటు వాహనాల్లో ప్రయాణిస్తున్నారు.

మండలంలోని గుంటసీమ మారుమూల గ్రామాల్లో గతంలో ఆర్టీసీ సర్వీసు ఉండేది. ఆ తర్వాత బస్సును తొలగించడంతో ఆ ప్రాంత గిరిజనులకు రవాణా సౌకర్యం కష్టంగా మారింది. బస్సు సౌకర్యం లేక తప్పని పరిస్థితిలో ప్రైవేటు వాహనాలను ఆశ్రయిస్తున్నారు. గిరిజనుల అవకాశాన్ని ఆసరాగా చేసుకుని ప్రవేటు వాహనదారులు సొమ్ము చేసుకుంటున్నారని ఆ ప్రాంత ప్రజలు వాపోతున్నారు. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా పరిమితికి మించి అధిక సంఖ్యలో ప్రయాణికులను వాహనాలను ఎక్కించుకుని ఆటోలు, జీపులను నడుపుతున్నారు. దీనివల్ల పలు ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. తక్షణమే ఉన్నతాధికారులు స్పందించి గుంటసీమలో ఆర్టీసీ సర్వీసును పునరుద్ధరించి రవాణా కష్టాలను తీర్చాలని గిరిజనులు కోరుతున్నారు.

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరి మృతి

» మృతుల్లో ఒకరు లంబసింగి పీహెచ్‌సీ అటెండర్‌, మరొకరు బాలుడు

చింతపల్లి, ఫిబ్రవరి 11: మండలంలో జరిగిన రెండు వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరు మృతి చెందారు. మృతుల్లో ఒకరు లంబసింగి పీహెచ్‌సీ అటెండర్‌ కాగా, మరొకరు సాడికపేట వీధికి చెందిన బాలుడు. నర్సీపట్నం-లంబసింగి మార్గంలో కొలపరి వద్ద ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందాడు. దీనికి సంబంధించి స్థానికులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు ఇలా వున్నాయి. చింతపల్లి మండలం అంతర్ల గ్రామానికి చెందిన వెంకటరావు(56) లంబసింగి పీహెచ్‌సీలో అంటెండర్‌గా పనిచేస్తున్నాడు. ఆదివారం వ్యక్తిగత పని మీద ద్విచక్ర వాహనంపై లోతుగెడ్డ వెళుతుండగా కొలపరి వద్ద గుర్తు తెలియని వాహనం ఎదురుగా వచ్చి బలంగా ఢీకొని వెళ్లిపోయింది. దీంతో తీవ్రంగా గాయపడిన వెంకటరావు రహదారి పక్కన పడిపోయాడు. స్థానికులు 108 వాహనంలో అతనిని చింతపల్లి ఏరియా ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందాడు. ఈ ఘటనపై కేసు నమోదుచేసి విచారణ చేపడుతున్నట్టు చింతపల్లి ఎస్‌ఐ అరుణ్‌ కిరణ్‌ తెలిపారు.



వెంకటరావు (ఫైల్‌ ఫొటో)

పెంటపాడు మలుపు వద్ద..

చింతపల్లి: మండలంలోని పెంటపాడు మలుపు వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ గిరిజన బాలుడు మృతి చెందగా, మరో యువకుడు తీవ్రంగా గాయపడ్డారు. ఈ సంఘటనకు సంబంధించి గూడెంకొత్తవీధి ఎస్‌ఐ అప్పలసూరి తెలిపిన వివరాలు ఇలా వున్నాయి. చింతపల్లి మండలం సాడికపేట వీధికి చెందిన కుడుముల సాయి(13), గూడెంకొత్తవీధి మండం దొడ్డికొండ గ్రామంలో నివాసముంటున్న గిరిజన యువకుడు గెమ్మెలి శ్రీను ఇద్దరు స్నేహితులు. ఇద్దరు శనివారం రాత్రి ద్విచక్రవాహనంపై దొడ్డికొండ గ్రామానికి బయలుదేరారు. శ్రీను వాహనం నడుపుతుండగా, సాయి వెనుక కూర్చున్నాడు. పెంటపాడు మలుపు వద్ద వాహనం అదుపుతప్పి లోయలో పడిపోయారు. దీంతో వెనుక కూర్చున్న సాయి సంఘటన స్థలంలోనే మృతి చెందాడు. తీవ్రంగా గాయపడిన శ్రీనును స్థానికులు చింతపల్లి ఏరియా ఆస్పత్రికి తరలించగా, వైద్యులు ప్రాథమిక చికిత్స అందించి కేజీహెచ్‌కి తరలించారు. శ్రీను ఆరోగ్య పరిస్థితి ఆందోళనకరంగా ఉందని వైద్యులు తెలిపారు.



మృతుడు సాయి (ఫైల్‌)

బీజేపీతోనే అభివృద్ధి సాధ్యం: గాసన్న

హుకుంపేట, ఫిబ్రవరి 11: బీజేపీతోనే రాష్ట్రంలోని అభివృద్ధి సాధ్యమని పార్టీ మండల అధ్యక్షుడు వంతల గాసన్న చెప్పారు. మండలంలోని తీగలవలస, కామయ్యాపేట, అల్లంపుట్టు గ్రామాల్లో పార్టీ నేతలతో కలిసి ఆదివారం పల్లెకు పోదాం కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రతీ ఇంటికి వెళ్లి కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించారు. ఆంధ్రప్రదేశ్‌ రాష్ట్రంలోని బీజేపీ ప్రభుత్వం వచ్చేలా ప్రజలు చూడాలని కోరారు. కార్యక్రమంలో స్థానిక నేతలు, ప్రజలు పాల్గొన్నారు.

సంక్షిప్తంగా..

రేపటి నుంచి భీమసింగి ఆశ్రమంలో ఆరాధన మహోత్సవాలు

చింతపల్లి, ఫిబ్రవరి 11: మండలంలోని భీమసింగి పాకలపాడు గురుదేవుల ఆశ్రమంలో మంగళవారం నుంచి ఆరాధన మహోత్సవాలు నిర్వహించనున్నట్టు భక్తులు తెలిపారు. మంగళవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు గిరిజన భక్తి భజన కార్యక్రమాలు, ప్రత్యేక పూజలు, అర్చనలు జరుగుతాయన్నారు. ఈ మహోత్సవానికి భక్తులందరూ తరలిరావాలని కోరారు. అలాగే భక్తుల కోసం సందేశాత్మక ప్రదర్శనలు ఏర్పాటు చేస్తామని చెప్పారు.

అసాంఘిక కార్యకలాపాలకు దూరంగా ఉండాలి



గిరిజనులకు సూచనలు ఇస్తున్న సీఐ రమేశ్‌

జి.మాడుగుల, ఫిబ్రవరి 11: గ్రామాల్లో గొడవలు, అసాంఘిక కార్యకలపాలకు దూరంగా ఉండాలని సీఐ రమేశ్‌ సూచించారు. పెదలోచలి పంచాయతీ పరిధిలోని బొర్రాతాడి గ్రామంలో ఆదివారం పర్యటించారు. ఈ సందర్భంగా గిరిజనులతో ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో నాటుసారా క్రయవిక్రయాలకు పాల్పడితే కఠినంగా వ్యవహరిస్తామని హెచ్చరించారు. అలాగే గ్రామాల్లో సమస్యలపై తమకు తెలియజేస్తే, సంబంధిత అధికారుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పోలీసు సిబ్బంది ఉన్నారు.

సప్పలమామిడిలో కనీస సదుపాయాలు కల్పించాలి

జి.మాడుగుల, ఫిబ్రవరి 11: మండలంలోని కుంబిడిసింగి పంచాయతీ సప్పలమామిడి గ్రామంలో కనీస సదుపాయాలు కల్పించాలని బీజేపీ గిరిజన మోర్చా మేధావుల కన్వీనర్‌ కురుసా పార్వతమ్మ డిమాండ్‌ చేశారు. పల్లెకు పోదాం కార్యక్రమంలో భాగంగా సప్పలమామిడి గ్రామాన్ని ఆదివారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామంలో రహదారి సౌకర్యం లేక అభివృద్ధికి దూరంగా ఉందన్నారు. అలాగే ఇటీవల ప్రధానమంత్రి అవాస్‌ యోజన పథకంలో మంజూరైన ఇళ్లకు జమ కావాల్సిన సొమ్ము వేరే వారి ఖాతాలోకి జమవుతుందని లబ్ధిదారులు వాపోయినట్టు చెప్పారు. అధికారులు స్పందించి బ్యాంకు ఖాతాలు తెరిసేలా చర్యలు చేపట్టాలని ఆమె డిమాండ్‌ చేశారు. కార్యక్రమంలో పార్టీ నేతలు ఉమమహేశ్వరరావు, రవికుమార్‌, శివక్రిష్ణ, నూకరాజు తదితరులు పాల్గొన్నారు.

ముమ్మరంగా వాహన తనిఖీలు

ముంచంగిపుట్టు, ఫిబ్రవరి 11: మండల కేంద్రంలో ఆదివారం ముమ్మర వాహన తనిఖీలు చేపట్టారు. ఎస్‌ఐ కె.రవీంద్ర ఆధ్వర్యంలో వివిధ ప్రాంతాలకు నుంచి మండల కేంద్రానికి వచ్చే వాహనాలను, ప్రయాణికుల లగేజీలను పోలీసులు క్షుణ్ణంగా తనిఖీలు చేశారు. అలాగే సరిహద్దు ప్రాంతం నుంచి మండలానికి వచ్చే వారిలో అనుమానితులు ఉంటే వెంటనే తమకు సమాచారం ఇవ్వాలని సూచించారు. అపరిచిత వ్యక్తులకు ఆశ్రయం కల్పించవద్దన్నారు. పోలీసులకు ప్రజలు సహకరించాలని ఎస్‌ఐ కోరారు.

ఓటు హక్కును ఉపయోగించుకోండి

» మానవ హక్కుల సంస్థ ప్రతినిధి బాలరాజు

డుంబ్రిగుడ, ఫిబ్రవరి 11: ప్రజాస్వామ్య వ్యవస్థలో ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును ఉయోగించుకోవాలని మానవ హక్కుల సంస్థ జాతీయ అధ్యక్షుడు రావూరి బాలరాజు కోరారు. మండలంలోని కొర్రాయి పంచాయతీ జాముగుడ గ్రామంలో సర్పంచ్‌ కొములు ఆధ్వర్యంలో ఓటు హక్కుపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మానవ హక్కులపై అందరూ అవగాహన కలిగి ఉండాలని, ఓటు హక్కును వినిగించుకోవాలని కోరారు. అనంతరం జాముగుడ బాలికల ఆశ్రమ పాఠశాలలోని పదో తరగతి విద్యార్థులకు పబ్లిక్‌ పరీక్షల సామగ్రిని అందజేశారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా కార్యదర్శి విక్రందేవ్‌, ఎడ్యుకేషన్‌ వింగ్‌ చైర్మన్‌ సన్యాసినాయుడు, మండల అధ్యక్షుడు జగన్నాథం, వినియోగదారుల సంఘం అధ్యక్షుడు చిట్టిబాబు, దిశ ఫౌండేషన్‌ అధ్యక్షుడు సరస్వతి, గిరిజనులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మతిస్థిమితం లేని యువకుడిపై దాడి

పాడేరు రూరల్‌, ఫిబ్రవరి 11: మతిస్థిమితం లేకుండా గ్రామాల్లో తిరుగుతున్న పాతపాడేరు గ్రామానికి చెందిన యువకుడు వినాయకుడు (15)పై దాడి జరిగింది. సంబంధిత వ్యక్తులపై పోలీసులకు కుటుంబ సభ్యులు ఫిర్యాదు చేశారు. మండలంలోని దిగువమోదాపుట్టు గ్రామానికి మతిస్థిమితం లేని వినాయకుడు ఆదివారం ఉదయం చేరుకున్నాడు. అయితే అక్కడ ఏం జరిగిందో తెలియదుగాని గ్రామస్థులు యుకుడిని చెట్టుకు కట్టి చావగొట్టారు. ఈ విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు అక్కడికి చేరుకొని గాయపడ్డ వినాయకుడును స్థానిక జిల్లా ఆస్పత్రికి తరలించి వైద్య సేవలు అందిస్తున్నారు. తమ కుమారుడిపై దాడికి పాల్పడిన వారిపై చర్యలు చేపట్టాలని కోరుతూ తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.



గాయపడ్డ యువకుడు

ప్రజా సమస్యల పరిష్కారానికి సీపీఎం అలుపెరగని పోరాటం

పాడేరు రూరల్‌, ఫిబ్రవరి 11: ప్రజా సమస్యల పరిష్కారానికి సీపీఎం నిరంతరం అలుపెరగని పోరాటం చేస్తున్నదని పార్టీ మండల కార్యదర్శి ఎల్‌.సుందరరావు కోరారు. మండలంలోని గుర్రగరువు గ్రామంలో ఆదివారం నిర్వహించిన మాస్‌ ఫండ్‌ క్యాంపెయిన్‌లో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ గుర్రగరువు గ్రామానికి రోడ్డు సదుపాయం సీపీఎం పోరాట ఫలితమేనని పేర్కొన్నారు. పోడు పట్టాలు, ఇళ్ల స్థలాల కోసం అనేక పోరాటాలు చేసి ఆదివాసీల పక్షాన నిలిచినట్టు చెప్పారు. అన్నారు. వైసీపీ ప్రభుత్వం ఆదివాసీ చట్టాలు, హక్కులను తుంగలోకుతుందన్నారు. ఆదివాసీల హక్కులకు భంగం కలిగించే పార్టీలకు ప్రజలు తగిన బుద్ధి చెప్పాలని కోరారు. అలాగే సీపీఎంకు ప్రజలు విరాళాలు అందించి ఉద్యమాలకు తోడ్పడాలని విన్నవించారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు, మాజీ సర్పంచ్‌ పాలికి లక్కు, కొర్రా సూరిబాబు, దాసు, మత్స్యరాజు, సింహాద్రి, ఏసుబాబు పాల్గొన్నారు.